# కథ

# అన్యధా శరణం

భమిడి వెంకటేశ్వర్లు

ఫోను రింగవుతూనే వుంది. చదువుతున్న పేపరు పక్కన పడేసి ఫోను దగ్గరకెళ్ళి ''డిస్ ప్లే'' చూసాడు శ్రీనివాసరావు. అది తంబయ్య నుంచి ఫోను. అప్పటికి అయిదోసారి ఫోను రావడం! మూడు సార్లు మర్యాదగా ఫోను తీసాడు తను. కాని తంబయ్య కట్ చేసాడు ఫోను. నాలుగోసారి రింగయినప్పుడు శ్రీనివాసరావు తీయలేదు. గంటన్నర తరువాత తిరిగి యిప్పుడు... యిలా.... ఫోను రింగవుతోంది. శ్రీనివాసరావు తీద్దామనుకుని 'వద్దులే'' అనుకుని పేపరులోకి తల దూర్చేసాడు.



Story

పావుగంట తరువాత ఫోను? తంబయ్య నుంచే! శ్రీనివాసరావుకు కోపం వచ్చింది. 'హలో' అంటూనే ఫోను తీసాడు.

"ఏమిటి... ఫోను తీయటం లేదూ" కోపాన్ని అణుచుకుంటూ అడిగాడు తంబయ్య.

"విషయం చెప్పు... సాగదీయకు" క్లుప్తంగా అడిగాడు శ్రీనివాసరావు.

"మీ యింటికి రావాలనుకుంటున్నాను. ఎప్పుడు రమ్మంటావు".

"అదేం పిచ్చి ప్రశ్న! నా దగ్గరకు వచ్చేందుకు అపాయింటుమెంటు, ముందస్తు అనుమతి కావాలా! కొత్తగా మాట్లాడుతున్నావేంటి! నేను నీలాటివాడిని కాకపోయినా నీలా మాత్రం కాదు. కాబట్టి ఎప్పుడైనా రావచ్చు" శ్రీనివాసరావుకి నిజంగానే కోపం వచ్చింది.

"ఇంతకీ ఎప్పుడు రమ్మంటావు" తంబయ్య ప్రశ్నించాడు.

"నీకు పనుంటే నువ్వు ఎలాగైనా వస్తావు. అనవసరంగా నువ్వు రావు. ఫోను చేయవు. నేను చేస్తే అవసరాన్ని బట్టి ఫోను తీస్తావు. లేకపోతే కట్ చేస్తావు. నాలుగైదు సంవత్సరాల నుంచి నువ్వు చేస్తున్న పనే యిది. పావలా ఖర్చుపెట్టవు నువ్వు. లాభ నష్టాల గురించి లెక్కలు కట్టి – ప్లస్సు, మైనస్సులతో బేరీజు వేస్తావు. కాబట్టి నీకు ఎలా చేయాలనుంటే అలా చేయి" అంటూ ఫోను పెట్టేసాడు శ్రీనివాసరావు.

తనతో ఏమిటి పని! అనుకున్నాడు.

గంట తరువాత తంబయ్య శ్రీనివాసరావు యింటికొచ్చాడు. అయిదు నిమిషాలు మంచీ చెడ్డా కార్యక్రమం తరువాత యోగక్షేమాల పర్వాన్ని కూడా టచ్ చేసాడు తంబయ్య. శ్రీనివాసరావు వింటున్నాడు.

"ఈ మధ్య అయిదారు ఇంజనీరింగ్ కాలేజీలకు వెళ్ళి వచ్చాను" తంబయ్య పాయింటుని టచ్ చేసాడు.

"ఎందుకు".

"మా వాడిని కాలేజీలో చేర్పించేందుకు! మేనేజిమెంటు కోటాలో చేర్పించాలని! కావలసిన గ్రూపు రావాలిగా!"

"ఇక్కడ సీటు రాదా"

"మంచి కాలేజీలో రాదు"

"శుభం నిర్ణయం మంచిదే... గుడ్‌లక్" అన్నాడు శ్రీనివాసరావు.

"కాలేజీలు, చదువులు, సీట్లు, ఫీజులు, డొనేషన్లు, హాస్టల్ ఫీజులు, పుస్తకాలు, డ్రస్సులకు రెండు మూడు లక్షల దాకా అవుతుంది" అంటూ నసిగాడు.

"సరే అయితే! నీ డబ్బు.... నీ కొడుకు.. నీ యిష్టం. నువ్వు డబ్బు విషయంలో బాగానే ఆలోచిస్తావు. పైగా డబ్బు గురించి నీ తర్వాతే ఎవరైనా!" అన్నాడు శ్రీనివాసరావు – తంబయ్య గురించి తెలుసు కాబట్టి.

"నువ్వు పాతిక వేలు సర్దాలి.... రెండు నెలల్లో తిరిగి యిచ్చేస్తాను. బ్యాంకులోను అప్లయ్ చేస్తాను. రాగానే యిచ్చేస్తాను" పాయింటులో కొచ్చాడు తంబయ్య.

శ్రీనివాసరావుకి తండ్రి మాటలు గుర్తుకొచ్చాయి. "నువ్వు రిటైరయ్యావు. నీ దగ్గర రిటైర్మెంటు బాపతు డబ్బు బాగానే వుంది. చుట్టాలు, స్నేహితులు, రక్త సంబంధీకులు యింకా చాలామందికి నీ ప్రేమ, అభిమానం, ఆప్యాయత పెరుగుతుంది. వాళ్ళ అవసరాలు, కోరికలు నీ ద్వారా తీర్చు కునేందుకు బెల్లం చుట్టూ చీమల్లా అవతారాలు ఎత్తుతారు. నీకు దాన గుణం వుంది గాని తిరిగి రాబట్టుకునే ఎత్తుగడలు, లౌక్యం, తెలివితేటలు లేవు. కాబట్టి బాగా ఆలోచించుకో" అంటూ నిజానికది సలహా కాదు... హెచ్చరిక!



ఏం చెప్పాలి... ఇవ్వడమా... లేదని చెప్పడమా! పైగా కొడుకు చదువు కోసం అడుగుతున్నాడు. తన వద్ద డబ్బు వుంచుకుని లేదని చెప్పడమా!

"నేను ఆలోచించుకోవాలి... పిల్లలతో చెప్పి..."

తంబయ్య చటుక్కున అన్నాడు "వాళ్ళని అడగడం చెప్పడం ఏమిటి?"

"రిటైరయ్యాక నేను నేను కాను. నా భార్యా పిల్లలకు జవాబు దారిని. వాళ్ళు చెప్పినట్లు నేను వినాలి! ఇది డబ్బు విషయం కదా".

"సరే అయితే! రెండు రోజుల తరువాత మళ్ళీ వస్తాను. ప్రస్తుతానికి పది వేలు సర్దులే..."

"ఇంతకీ ఎవరెవరి దగ్గర ఎంతెంత తీసుకున్నావు?" చటుక్కున అడిగాడు శ్రీనివాసరావు.

తంబయ్యకు చెప్పడం యిష్టం లేదు.

"అయినా నీకు డబ్బు అవసరం ఏమిటి? నీది వడ్డించిన విస్తరిలాటి జీవితం. మీ నాన్న నుంచి తెలివిగా లక్షల విలువ చేసే యిల్లు కొట్టేసావు. పైగా ఆయన దగ్గరున్న బాంకు డిపాజిట్లు కూడా నొక్కేసావు. ఇంటి అద్దె పదివేలు వస్తోంది. మీ అన్నల ముగ్గురికీ గుండు కొట్టించేవు. ఇంట్లో అధునాతన వస్తువులు, సామగ్రి సంపాదించావు. తండ్రి డబ్బుని నీ స్వార్థానికి ఉపయోగించు కున్నావు. నువ్వే యితరులకు 'అప్పు యిచ్చే స్థితిలో వున్నావు" శ్రీనివాసరావు చెబుతున్నాడు.

"రోజులు చాలాకష్టంగా వున్నాయి. ఖర్చులు పెరిగాయి. పిల్లల్ని చదివించేందుకు వేలు అవుతోంది."

"అదంతా మేమూ అనుభవించాం. మాకెవరూ కామధేనువు – కల్పవృక్షం లాటి తండ్రులు లేరు" శ్రీనివాసరావు క్లుప్తంగా అన్నాడు.

"మీ కాలం వేరు. ఖర్చులు వేరు" అనేసాడు తంబయ్య. "ఎప్పుడు రమ్మంటావు" అని అడుగుతూ

"నాలుగైదు రోజుల తరువాత ఫోను చేయి"

"మరి యిప్పుడు..." అంటూ నసిగాడు.

"ఇప్పుడేం యివ్వను. చెప్పినట్లు చేయి".

"ఇప్పటికే రెండు మూడు కాలేజీల్లో సీట్లు రెడీగా వున్నాయి... డబ్బు కట్టడమే ఆలస్యం.."

"ఇంకేం చెప్పద్దు నాకు" నిశ్చయంగా అన్నాడు శ్రీనివాసరావు.

వారం తరువాత–

తంబయ్యకు పదిహేను వేలు యిచ్చాడు శ్రీనివాసరావు. "మొత్తం పద్దెనిమిది వేలు యివ్వాలి నువ్వు. మాట ప్రకారం యిచ్చేసేయాలి. నాచేత అడిగించుకునే పరిస్థితి రాకూడదు" చెప్పాడు.

తంబయ్య లెక్కపెట్టాక అన్నాడు "పదిహేను యిచ్చి – పద్దెనిమిది వేలు అంటావేం" అని.

"నీకు తీసుకున్న డబ్బు గుర్తుండదు. ఇదివరకు మూడు వేలు యిచ్చాను. ఏడాది దాటింది. ఆ డబ్బు గురించి వూసేలేదు. అడగలేదని చంకలు ఎగరేసుకుంటున్నావు కాబోలు. మంచి తనానికి ఓ హద్దూ వుంటుంది" అంటూ గుర్తు

చేసాడు అతను.

తంబయ్య సర్దుకున్నాడు. తనకు అన్నీ గుర్తే! జస్ట్ – అలా ఓ వల విసిరి చూసాడు.

ఆరు నెలలు గడిచాయి. తంబయ్య డబ్బు తిరిగి యివ్వలేదు. పదిహేను, యిరవైసార్లు ఫోను చేసాడు. – ఫోను అటెండు కాలేదు తంబయ్య. ఇంటికెళ్ళాడు. అయిదారుసార్లు – దొరకలేదు. మరికొన్ని విషయాలు తెలిసాయి శ్రీనివాసరావుకి. తంబయ్య మూడు లక్షల దాకా అప్పులు తీసుకున్నాడు. బ్యాంకులోను కూడా తీసుకున్నాడు. కొడుకుని సిటీలోని కాలేజీలోనే చేర్పించాడు, కౌన్సిలింగు సీటు ద్వారా!

ఎన్నాళ్ళని యిటువంటివి దాగి వుంటాయి?

డబ్బు పొందేవరకు అది తంబయ్య అవసరం. ఇప్పుడు తిరిగి పొందడం శ్రీనివాసరావు అవసరం! తంబయ్య గురించి తెలిసి బుట్టలో పడ్డాడు శ్రీనివాస రావు! కేవలం మంచితనం, ఉపకార బుద్ధి కారణంగా, మనుషుల కంటే డబ్బు ఎప్పుడూ పవర్‌ఫుల్లే! దానిముందు మంచితనం, మానవత్వం దిగదుడుపే! ఇది స్వయం కృతాపరాధం గానే భావించాలి తను! శ్రీనివాసరావు ఆలోచిస్తున్నాడు.

తంబయ్యను ఆఫీసులో కలవాలనుకున్నాడు తను. మొత్తం మీద వివరాలు తెలుసుకుని ఆఫీసుకు వెళ్ళాడు శ్రీనివాసరావు. తిన్నగా సీటు దగ్గరికెళ్ళాడు. అప్పుడు పదకొండున్నరయింది టైము.

తంబయ్య సీటులో లేడు.

పక్క సీటులోని వ్యక్తిని అడిగాడు.

అతని పేరు సీతాపతిగా టేబులు మీదున్న నేం ప్లేటు ద్వారా గ్రహించాడు శ్రీనివాసరావు.

తంబయ్య గురించి అడిగాడు తను.

సీతాపతి నవ్వేసాడు. "తంబయ్య గురించి మీకు తెలీదా... అతను ఆఫీసుకు సరిగా రాడు. వచ్చినా పని చేయడు. అసలు సీట్లోనే అరగంట కూడా కూర్చోడు. ఇంతకీ మీరెవరు?" అని ప్రశ్నించాడు.

శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ ఉద్యోగిగానే రిటైరయ్యాడు. అయితే తను క్రమశిక్షణకు, సిన్సియారిటీకి, నిబద్ధతకు, బాధ్యతకు మారుపేరుగా పని చేసాడు. గౌరవంగా, మర్యాదగా పదవీ విరమణ చేసాడు. అతన్ని చూసి పని దొంగలు సిగ్గు పడాల్సిందే! పని చేయకుండా బలాదూరుగా తిరిగే బద్ధకస్తులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిందే! ఉద్యోగి అంటే మారుపేరుగా నిలిచిన చిరునామా అతను!

సీతాపతిని అడిగాడు శ్రీనివాసరావు. "ఇవేళ అటెండెన్సు పల్చగా వుందే! సీట్లల్లో ఉద్యోగులు కనిపించడం లేదే" అంటూ.

సీతాపతికి నవ్వొచ్చింది. "ఇక్కడి వారికి ఆఫీసు సెకండరీ! చాలామందికి బయట వ్యవహారాలు. కార్యక్రమాలు ఉన్నాయి. టైముంటే, గుర్తుంటే ఆఫీసు కొస్తారు. నాయకులు, అధికారులు చాలా చాలా మంచివాళ్ళు. 'ఎందుకంటే ఎవరూ ఎవరినీ పని గురించి అడగరు. ఆఫీసుకు ఎందుకు రావటం లేదు' అని అడగరు. నెలకు అయిదారు రోజులు దర్శన మిచ్చే ప్రబుద్ధులూ ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల రూపురేఖలు మారిపోయాయి. ప్చ్!" అన్నాడు బాధగా – నిస్తేజంగా.

"మరి పని ఎలా అవుతోంది".

"పని చేసే వాడికి పని.. చేయని వాడికి జీతం పార్ములా మంత్రంగా పని చేస్తోందిప్పుడు".

సీతాపతి ధోరణిని కట్‌చేస్తూ అడిగాడు శ్రీనివాస రావు "మీరు ఎంతకాలం నుంచి పని చేస్తున్నారు?"

"మూడు పదులు దాటింది"

ఆశ్చర్యపోయాడు తను.

"టైముకు ఆఫీసుకురావడం. పని శ్రద్ధగా చేయడం. ఇంటికెళ్ళి తృప్తిగా, ఆనందంగా నిద్రపోవడం నా మేనిఫెస్టో! మనస్సాక్షిని మోసం చేయలేను" సీతాపతి గొంతు జీరగా తోచింది.

శ్రీనివాసరావు అందుకున్నాడు "సారీ... నేను కూడా మీ టైపులోనే ఆలోచిస్తాను. నా ఉద్యోగం ఆనందం సంతృప్తి, హాయిని మిగిల్చింది. ఆఫీసులు యిలా తగులబడి పోవటానికి కారణం అధికారుల అలసత్వం, పట్టించుకోక పోవడం... కళ్ళు మూసుకోడమే!" ఆవేశంగా.

"ఇంతకీ తంబయ్యతో మీకేం పని" అడిగాడు సీతాపతి.

"కొద్దిగా పనుంది".

శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ ఉద్యోగిగానే రిటైరయ్యాడు. అయితే తను క్రమశిక్షణకు, సిన్సియారిటీకి, నిబద్ధతకు, బాధ్యతకు మారుపేరుగా పని చేసాడు. గౌరవంగా, మర్యాదగా పదవీ విరమణ చేసాడు. అతన్ని చూసి పని దొంగలు సిగ్గు పడాల్సిందే! పని చేయకుండా బలాదూరుగా తిరిగే బద్ధకస్తులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిందే! ఉద్యోగి అంటే మారుపేరుగా నిలిచిన చిరునామా అతను!

సీతాపతి నవ్వేసాడు "అబద్ధం చెప్పకండి సార్... అతనికి అప్పు యిచ్చారు. ఆ విషయమై వచ్చారు" అన్నాడు.

శ్రీనివాసరావు ఖంగుతిన్నాడు.

"మీలా చాలామంది వస్తుంటారు" అనేసాడు కూడా.

అతనికి ఏం అర్థం కావటం లేదు. వెళ్ళిపోదామనుకున్నాడు. "తంబయ్య యింట్లో నాలుగు సెల్ ఫోన్లున్నాయి. ఈ నెంబరుకు ఫోను చేయండి.... దొరుకుతాడు – బయట నుంచి ఫోను చేయండి. అటెండవుతాడు" అంటూ రహస్యం విప్పాడు.

శ్రీనివాసరావు తన ఫోను నెంబరు యిచ్చి వెళ్ళిపోయాడు.

***

వారం రోజుల తర్వాత సీతాపతి ఫోను చేసాడు. "ఓ సారి ఆఫీసుకు అర్జంటుగా రండి" అంటూ.

శ్రీనివాసరావుకి కంగారు పుట్టింది. పరుగులాటి నడకతో బయలు దేరాడు.

ఇద్దరూ కలిసి ఓ పెద్దాసుపత్రికి బయలుదేరారు.

"ఇంతకీ ఏం జరిగింది?" ఆత్రంగా అడిగాడతను.

"కంగారు పడకండి... తంబయ్యను ఏక్సిడెంటు చేసాడు ఓ కొలీగు.."

"ఎందుకు.."

"మామూలే... బాకీ చెల్లు చేయమన్నాడు. కథ షరామామూలే... అన్నట్లు – బాకీ చెల్లించకపోగా కారు కూతలు కూసాడు తంబయ్య. అతనికి వళ్ళు మండి, యింట్లో నుంచి యిద్దరు మనుషుల ద్వారా టీవీ, ఫ్రిజ్, కంప్యూటరు, వాషింగ్ మెషీను తీసుకుపోయాడు. తంబయ్య యీ దౌర్జన్యానికి పోలీసు కంప్లయింటు యిచ్చాడు. అయితే ఏదో మానేజ్ చేసాడు పోలీసు స్టేషన్లో మనవాడు. తరువాత మోటారు బైకుతో గుద్దించాడు... ఆ తరువాత కథ యిలా మారింది..." అంటూ వివరించాడు సీతాపతి. ఇద్దరూ తంబయ్య ఉన్న ఆసుపత్రికి చేరారు.

తంబయ్య చటుక్కున దుప్పట్లోకి ముఖాన్ని దాచుకున్నాడు. "ఏం జరిగింది" అడిగాడు శ్రీనివాస రావు.

తంబయ్యకు నోరు పెగలటం లేదు. అక్కడే అతని భార్య కూడా వుంది. "ఈయన చాలా మొండి మనిషి. ఆయనతో కాపురం నా వల్లకాదు. నిలువెల్లా మోసం, మాయ, దగా, అన్యాయం చేద్దామన్న ఆలోచనే! తండ్రిచేతనే మోసంతో యిల్లు రాయించుకున్నాడాయన. తండ్రి తిండికి డబ్బు తీసుకునే వాడు. చివరకు తండ్రి చనిపోతే ఆసుపత్రి నుంచి శవం తెచ్చేందుకు డబ్బుల్లేవన్నాడు.. ఇలా చెప్పాలంటే చాలానే వుంది... ఇప్పుడిదీ పరిస్థితి... లక్షరూపాయలకు ఎస్టిమేటు యిచ్చారు ఆసుపత్రి వాళ్ళు..." ఆవిడ కళ్ళు అద్దుకుంటుంటే అన్నాడు శ్రీనివాసరావు –

"ఇన్నాళ్ళూ నువ్వేం చేసావు! తీసుకున్న అప్పులు ఏం చేసాడు? నాకు ఎందుకు చెప్పలేదు? అంటే, నీవు కూడా యిందులో చెయ్యేసేవనిపిస్తోంది. ఇప్పుడు యిలా మాట్లాడటం పద్ధతి, మర్యాద కాదు" అతనికి కోపం వచ్చింది.

"మీరే మమ్మల్ని గట్టెక్కించాలి" అందావిడ.

"మేము ఆఫీసు నుంచి అరవై వేల దాకా వసూలు చేసాం. మరో యిరవై వేలు రావలసి వుంది" అన్నాడు సీతాపతి.

"నువ్వు యిటువంటి పనులు చేస్తుంటే, నీ పిల్లలు కూడా నీ దారిలోనే నడుస్తారు. వాళ్ళు నీకు ద్రోహం తలపెట్టినా – వారిలో వారే కలబడ్డా ఆశ్చర్య పడక్కర్లేదు. అన్యాయం, మోసం ఎక్కువ కాలం దాగదు" అంటూ మందలించాడు శ్రీనివాసరావు.

"అదంతా ఎందుకిప్పుడు" అంటూ చేతులు పట్టుకున్నాడు తంబయ్య. అతని పెదవులు మూగగా ఏదో గొణిగాయి. శ్రీనివాసరావుకి అర్థమైంది.

"మనిషిలోని మంచితనాన్ని చేతకాని తనంగా భావించినప్పుడు – దౌర్జన్యం రంగంలోకి దిగుతుందిలా. నీకేం ఫరవాలేదు" అంటూ తంబయ్య తల నిమిరాడు శ్రీనివాసరావు – అతని భార్యవైపు చూస్తూ.

*

చిరునామా:
**భమిడి వెంకటేశ్వర్లు,**
**12-2-878/ఏ/17, అంబాగార్డెన్సు,**
**మెహిదీపట్నం, హైదరాబాదు – 500 028.**